


# డబ్బుకి కూడా హెచ్చుతగ్గులు!

—కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

**ఆకాశం** శాంతి సముద్రంలా ఉంది.

సృష్టికి కాంతినీ, శక్తినీ దానం చేస్తున్న దివ్య తేజోమూర్తి ఆదిత్యుని జ్యోతి రథం విను వీధిలో వేగంగా సాగిపోతూంది.

ఆ వెలుగు వెల్లువలో జన పదాలు మునిగిపోతున్నాయి.

ఆ వెల్లువ ఇల్లిల్లూ ఆలింగనం చేసుకుంటూంది.

పగటు ఇల్లాలు భూదేవమ్మ నిమీలిత నేత్రాలతో, ముకుళిత హస్తాలతో సూర్యస్తవం పూర్తిచేసుకుని, అర్ఘ్యం వదిలింది.

ఎదురుగా ఉన్న తులసమ్మ మీద ఇన్ని పూలు, అక్షింతలు జల్లి ఇంట్లోకి నడిచింది.

అప్పటికి గోడ గడియారం కాల సంగీతాన్ని వినిపించటం మొదలు పెట్టింది.

"ఒకటి ... రెండు ..." తొమ్మిది లెక్కపెట్టింది మనసులోనే.

'అయ్యో! అబ్బాయికి టైమయిపోతూంది' అనుకుంటూ ఆదరాబాదరా పనులకు పూనుకుంది. 'ఈ సంసార ఝంఝాటానికీ, దైవ పూజకూ పొత్తు కుదరదు' అని కూడా బాధపడింది.

తొందరలో చిన్న చిన్న పొరబాట్లు కూడాచేసి, మళ్ళీ సర్దుకుంది.

నవ్వొచ్చింది.

వయసు పెరిగిన కొద్దీ మానసికంగా శారీరకంగా బలహీనతకు లోనవుతూ ఉంటాడు మనిషి. కొండల నెత్తాలనే కోరిక ఉంటుంది కానీ, బలం ఉండదు.

"అమ్మా! అన్నం వడ్డిస్తావా? టైమవుతోంది." రామ్మూర్తి కాలేజికి వెళ్ళేందుకు సిద్ధమవుతూ తల్లి నడిగాడు.

"వడ్డించేస్తున్నారా. ఒక్క నిమిషం." ఆదరాబాదరా పీట వాల్చి, కంచం పెట్టింది. రామ్మూర్తి మర చెంబుతో మంచినీళ్ళు పెట్టుకుని కూర్చున్నాడు.

ఆధరువులు, అన్నం వడ్డించింది భూదేవి.

ఆవిర్లు చిమ్ముతున్న అన్నం చల్లారేందుకు విసనకర్రతో విసురుతూ కూర్చుంది.

రామ్మూర్తి భోజనానికి ఉపక్రమించాడు.

"పరీక్ష లెప్పుడు, బాబూ?" కుతూహలంగా ప్రశ్నించింది భూదేవి.

"ఇంకొక్క పదిహేను రోజులున్నాయమ్మా" తింటూనే జవాబిచ్చాడు.

"బాగా కృషిచెయ్యి, నాయనా! చివరి పరీక్షలు కదా? ఇవి దాటి ఒడ్డున పడితే మన కష్టాలు గట్టెక్కినట్టే. ఇంతకాలమూ ఫస్టు మార్కులతోనే వస్తున్నావు. ఆ శ్రీనివాసుడి దయవల్ల ఈ మాటు కూడా ఫస్టుగా పాసవుతే కొండకి వెళదామనుకుంటున్నాను."

రామ్మూర్తి మౌనంగా వింటున్నాడు.

తల్లిబాధ అతనికి కొత్త కాదు.

అయిదవ ఏట తండ్రి గతించిన తదాది అన్నీ అవిడే అయి పెంచింది. తండ్రిది మాట పాలిక పెన్షను. మిగిలిన లోటు బట్టలు కుట్టిపెట్టటం, అప్పడాలు, వూరగాయలు అమ్మటం ద్వారా భర్తీ చేసి, గుంభనంగా నిండుగా సంసార రథం నడిపిస్తూంది.

భవిష్యత్తు మీద ఆశ, స్వశక్తి మీద నమ్మకం తన ఆస్తిపాస్తులు అనుకుంది భూదేవి.

అదే నమ్మకాన్ని కొడుకు మనసులో బలంగా నాటింది.

నడుస్తున్న రైలు చక్రాలు వేగాన్ని బట్టి త్వరగానో, ఆలస్యంగానో గమ్యాన్ని చేరతాయి.

మనిషి ప్రయత్నాలూ అంతే.

ఈ సత్యాన్నెప్పుడూ మరిచిపోయే వాడు కాదు రామ్మూర్తి.

ఎప్పుడు పుస్తకాలు తెరిచినా మొదట కళ్ళ ఎదుట రుధిరాన్ని స్వేదంగా మారుస్తూ, యంత్రంలా తనకోసం పాటుపడుతున్న తల్లి రూపమే కనిపించేది.

వెంటనే అతనిలో కర్తవ్య దీక్ష మరింత బలపడేది.

"మజ్జిగ పొయ్యమ్మా!" చివరి ముద్ద తిని మంచినీళ్ళు తాగుతూ అన్నాడు రామ్మూర్తి.

"కాస్త అన్నం పెట్టించుకోరా."

"వద్దమ్మా. ఆకలిగా లేదు."

"ఆకలిగా లేదా, టైములేదా? పిచ్చి నాగన్నా! నా పూజలతో నీకు రోజూ ఆలస్యం అయిపోతోంది. ఎంత త్వరగా తెముల్చుకుందామన్నా ఈ వేళ అవుతూనే ఉంది." మజ్జిగ వడ్డిస్తూ బాధగా అంది.

"అబ్బే! అదేం లేదమ్మా. నువ్వు టైముకే చేసి పెడుతున్నావు. నా కిలా ప్రతి పనిలో హడావిడి మామూలేగా?" నవ్వేస్తూ మజ్జిగ అన్నం కలుపుకున్నాడు రామ్మూర్తి.

భూదేవమ్మ నిట్టూర్చింది.

• • •

అంజయ్య అయాసపడుతూ మెట్లెక్కుతున్నాడు.

ఎండ తీక్షణత అంతా తన పరంగానే అయినట్లు చెమటలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

ముందు వసారాలో అడుగు పెట్టగానే నీడ చల్లదనానికి ప్రాణం లేచివచ్చినట్లనిపించింది. మెల్లగా చతికిలబడ్డాడు.

భుజం మీద నుంచి అతుకుల బొంత క్రింద పెట్టి సేద తీరాడు.

అన్నం గిన్నె అడుగున పట్టెడు మెతుకులు ఉన్నాయి.

ఈ రోజు అంతవరకే దొరికింది.

ఎంత తిరిగినా, కాళ్ళు నొప్పులు పుట్టాయికానీ గిన్నె మాత్రం నిండలేదు.

ఇలాంటప్పుడు అంజయ్యకు భూదేవమ్మ లోగిలి గుర్తు వచ్చింది.

భూదేవమ్మ బదులు అన్నపూర్ణమ్మ అయితే, ఆ పేరు ఆమెకు బాగా సరిపోయేదనుకుంటూ ఉంటాడు అంజయ్య.

ఓర్పుకు భూదేవమ్మ అయితే, దాతృత్వానికి కాశీ అన్నపూర్ణే ఆవిడ. ఉన్నదానిలోంచే ఇంత పెడుతుంది. లేదని మాత్రం ఆమె నోట ఎప్పుడూ రాదు.

తెరిచి ఉన్న తలుపులోంచి, దొడ్లో తులసికోట కనిపిస్తూంది.

చిరుగాలికి పచ్చటి విష్ణు తులసి తల ఆడిస్తూంది.

భూదేవమ్మ వంటింట్లో ఉన్నట్లుంది—ఎక్కడా అలికిడి లేదు.

"అమ్మా! కాస్త అన్నం పెట్టమ్మా!" అంజయ్య కేక లోపలికంటూ వెళ్ళింది.

"వస్తున్నా. కూర్చో, అంజయ్యా!" లోపలి నుంచి బదులు పలికింది, భూదేవమ్మ.

"అలాగేనమ్మా, అలాగే." వినయంగా బదులు పలికాడు.

గోడమీద గాలికి కదులుతున్న కాలెండరు, పాత బడిన ఫోటోలు, సాలీడు అందంగా అల్లుకున్న గూడు, కండరీగ మట్టితో కట్టుకున్న ఇల్లు చూస్తూండగానే భూదేవమ్మ పళ్ళెంలో అన్నమూ, పప్పూ తీసుకు వచ్చింది.

సంభ్రమంగా సర్దుకుని, అన్నంగిన్నె పైకెత్తి పట్టుకున్నాడు అంజయ్య.

"ఏం, అంజయ్యా! ఈ మధ్య కనపట్టం మానేశా



నేం?" అంది మందహాసంతో అన్నం వడ్డిస్తూ.

"పెట్టే తల్లి ఉంది కదా అని రోజూ వస్తే ఏం బాగుంటుందమ్మా? రెక్కల కష్టం చేసుకుని ఒక్కగా నొక్క కొడుకుని చదివించుకుంటున్నారు. మీ బాధలు మీకున్నాయి" అన్నాడు సానుభూతిగా.

"దానిదేముందిలే, అంజయ్యా! ఓపిక ఉన్న రోజుల్లో ఎన్ని పనులు చేసి పెట్టావు మాకు? ఏదో వయసు అయిపోయి, ఇలా ఇళ్లిళ్లు తిరగవలసి వచ్చింది కానీ!" అంది జాలిగా.

"జాలి గల తల్లివి. నువ్వు తప్ప ఎవరూ ఆ మాట అనరు, తల్లీ. ఎవరి గుమ్మం తొక్కినా చీదరించుకునే వాళ్ళే." బరువుగా నిట్టూర్చాడు.

"అందరి మనసులూ ఒకటిగా ఉంటాయా, అంజయ్యా! ఎండ నిచ్చిన దేవుడే వెన్నెలా ఇచ్చాడు కదా? ఇక మనుషుల గురించి మనం బాధపడటం ఎందుకు? తింటూ ఉండు. మంచినీళ్ళు తెస్తాను." లోపలికి వెళ్ళింది.

అంజయ్య ఆబగా అన్నం కలుపుకుని తిన సాగాడు.

భూదేవమ్మ మంచినీళ్ళు తెచ్చి, అతని లోటాలో పోసింది. తృప్తిగా తిని, మెతుకులన్నీ ఏరి, నీళ్ళతో తుడిచి, ఒక పక్కగా నడుము వాల్చాడు అంజయ్య.

అలా ఎంతసేపు నిద్రపోయాడో అతనికే తెలియదు.

మెల్లగా మాటలువినిపిస్తుంటే మెలకువ వచ్చింది.

రామ్మూర్తి కాలేజి నుంచి వచ్చినట్లున్నాడు. తల్లితో మాట్లాడుతున్నాడు.

"అట్లాగంటే ఎలాగమ్మా? ఇలాంటి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదమ్మా. తాజమహల్ చూట్టం అంటే జన్మ తరించినట్లే!"

"నిజమే కావచ్చు, బాబూ! కానీ, ఉన్నపళంగా నూట ఏభై రూపాయలు ఎక్కణ్ణుంచి తీసుకు రాను? మన పరిస్థితి నీకు తెలియనిదేముంది?"

అంజయ్యకు గట్టిగా ఆవులింత వచ్చింది.

రామ్మూర్తి ఉలిక్కిపడి చూశాడు. "ఓ! నిద్ర లేచావా, అంజయ్యా?" అన్నాడు నవ్వుతూ.

"ఏమిటి, బాబూ, ఎక్కడికో వెళతా నంటున్నారు?"

"మా కాలేజీ వాళ్ళు ఈ దసరా సెలవుల్లో ఆగ్రా ఎక్స్‌కర్షన్ వేశారు, అంజయ్యా! ముందుగా నూటఏభై రూపాయలు కట్టిన వాళ్ళనే తీసుకు వెళతారట."

"ఆగ్రాలో ఏముంటాయి, బాబూ?" అమాయకంగా అడిగాడు అంజయ్య.

"అరే! ఆగ్రాలో తాజమహల్ ఉందని తెలియదా నీకు?"

"నాకేం తెలుసు, బాబూ?" నవ్వాడు. "నేను మీలా చదువుకోలేదుగా?"

"అవునుకదా? మరిచేపోయాను." జాలిగా చూసి— "ఆగ్రాలో తాజమహల్ అని గొప్ప కట్టడం ఉంది. దాని కోసం షాజహాను అనే చక్రవర్తి కొన్ని కోట్లు ఖర్చు చేశాడు. అది కట్టడానికి ఎన్నో ఏళ్ళు పట్టింది" అన్నాడు రామ్మూర్తి.

"అందులో విశేషం ఏమిటి, బాబూ? రాజుల సొమ్ము రాళ్ళపాలని వాళ్ళు ఆ సొమ్మంతా కోటలకి, కొండలకి పెట్టారు."

"నిజమే కానీ, ఇది అలాంటిది కాదు, అంజయ్యా! దీన్ని పూర్తిగా చలువరాయితో కట్టారు. ప్రపంచం లోనే దానికి పెద్ద పేరు ఉంది. ఎక్కడెక్కడి నుంచో పైదేశాల వాళ్ళు వేల కొద్దీ రూపాయలు ఖర్చు పెట్టి వచ్చి చూసి వెళుతూంటారు."

"అలాగా, బాబూ! అంత గొప్పగా ఉంటుందా? అయితే తమరు వెళ్ళవలసిందే."

"నువ్వుకూడా అలా గంటావేం, అంజయ్యా? అన్నీ తెలిసికూడా!" బాధగా అంది భూదేవమ్మ.

నవ్వాడు అంజయ్య.

"అమ్మా! నా కిప్పుడు రెక్కలతో ఎగిరి ఆ బాబు చెప్పిన వూరు చూడాలని ఉంది. కాని, ఈ ఆకు ఎండిపోయింది. హుషారుగా కదిలిందా, వూడి రాలిపోతుంది. ఆ బాబు కేమిటమ్మా? వయసుంది. ఎగిరే వయసు. పంపించు, తల్లీ! రెక్కలు కట్టెయ్యకు."

"భలే బాగా మాట్లాడతావే నువ్వు!" ప్రశంసగా చూస్తూ అన్నాడు రామ్మూర్తి.

"మాటల కేం ఉంటలే,బాబూ! చేతలు కావాలి కానీ. అన్నట్టు నీకు కావలసిన దెంత?"

"ఏం, ఇస్తావా?" ఛలోక్తిగా అన్నాడు, రామ్మూర్తి.

సమాధానం చెప్పకుండా బొంతకు ఒక పక్క కుట్లు తెంపి, నోట్లు బయటికి లాగాడు అంజయ్య.

నివ్వెరపోయి చూస్తున్నారు భూదేవమ్మ, రామ్మూర్తి.

అంజయ్య చెయ్యి బొంత లోపలికి పెట్టి చిన్న, పెద్ద నోట్లు బయటికి లాగుతూనే ఉన్నాడు.

చూస్తూ ఉండగానే చాలా నోట్లు బయటపడ్డాయి.

అప్రయత్నంగా తల్లీ కొడుకులు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

వాళ్ళ కిది నిజమో, మాయో అర్థం కావటం లేదు.

తెల్లవారి లేస్తే "అమ్మా అన్నం" అంటూ ఇల్లిల్లూ తిరుగుతూ, బస్ స్టాండ్ దగ్గర చిల్లర డబ్బులు అడుక్కునే అంజయ్య దగ్గర ఇంత డబ్బు ఉందా?

ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో వాళ్ళ కర్థం కావటం లేదు.

అంజయ్య వాళ్ళ వూహలతో నిమిత్తం లేనట్లు నోట్లు ఏ రకానికి ఆ రకం వేరు చేస్తూ వాటి మీద బరువు కోసం అందుబాటులో ఉన్న రాళ్ళు పెట్ట సాగాడు.

అంతా పూర్తి చేసి, తల ఎత్తి వాళ్ళను చూస్తూ నవ్వాడు.

వాళ్ళిద్దరూ ఆశ్చర్యం నుంచి అప్పుడే తేరుకుంటున్నారు.

వాళ్ళ భావాలు చదివిన వాడిలా—"అడుక్కునే అంజిగాడి దగ్గర ఇంత డబ్బేమిటా అని ఆశ్చర్యపోతున్నారు కదూ?" అని పెరిగిన గడ్డాన్ని వేలితో గోక్కుంటూ డబ్బు కేసి చూసి, నవ్వు మొహంతో చెప్పసాగాడు.

"ఈ అంజిగాడు పనివాడుగా కొన్నాళ్ళు బతికినట్టు తమరికి తెలుసు. కానీ, తల్లీ! రెక్కాడినా డొక్కాడని రోజు లవి. డబ్బులేని వాడు డుబ్బుక్కొరగాడనీ—నా అనుకున్న వాళ్ళంతా వదిలిపోయారు. ఇంత కష్టపడి ఎవరికి పెట్టాలని, కష్టం లేకుండా అడుక్కుతిని బతకటం మేలనిపించింది. అప్పటి నుంచీ పోగు చేసిన డబ్బు లివి. మీకు తెలియదు కానండమ్మా, బిచ్చగాడి సంపాదన తక్కువేం కాదు. తిండికి తిండీ, డబ్బుకు డబ్బూ. ఎవరమ్మా ఈ రోజుల్లో కష్టం చేస్తే ఇచ్చేది? ఈ డబ్బు ఎంతో నాకు తెలియదు. కానీ కనీసం, అయిదారు వేలుంటుందనుకుంటున్నా. నేను మంచిగా చదువుకుని ఉంటే. . ." అంజయ్య గొంతు బిగ పట్టింది. శూన్యం కేసి చూస్తూ అక్కడ తన వూహను ఆవిష్కరించి చూస్తూ కొద్ది క్షణాలు అలాగే ఉండి పోయాడు. అతడికి సూట్లు వేసుకుని కారుల్లో దర్జాగా తిరిగే వాళ్ళూ, కుటుంబాలు వెంటేసుకుని కులాసాగా కేరింతలు కొడుతూ పరుగులు తీసేవాళ్ళూ వూహాచిత్రం లోంచి తొంగి చూసి, మనసులో అలజడి లేపారు.

"చదువుకుని ఉంటే బాగు పడేవాడిని. అమ్మా! నాకూ వయసయి పోయింది. ఈ వేళో రేపో అన్నట్టున్నాను. ఈ డబ్బు నా దగ్గరుందంటే నా ప్రాణానికి ముప్పు వచ్చినా రావచ్చు. ఇన్నాళ్ళూ ఆ దేముడి దయవల్ల ఎలాగో కాపాడాను. ఇంక నా వల్ల కాదు. నేను దిక్కులేని చావు చస్తే, నా పెళ్ళాం బిడ్డలమని చెప్పి డబ్బు కోసం ఎగబడే వాళ్ళు ఎంతో మంది ఉంటారు. ఇన్నాళ్ళూ ఎందరెందరో మంచి మనుషులు జాలితో ఇచ్చిన డబ్బును చివరి కట్టా కసాయి వాళ్ళ పాలు కావటం నా కిష్టం లేదు. ఈ డబ్బు తమ దగ్గర ఉంచి బాబును డాక్టరు చదువు చదివించండి. కాదంటే ప్లీడరు చదువు చదివించండి. ఏం చదువుతున్నా, పేదవాళ్ళ బతుకులు బాగు చెయ్యమనండి. అప్పుడు చచ్చి నే నెక్కడున్నా సంతోషిస్తాను. ఇవి అడుక్కునే వాడి డబ్బులని సందేహించద్దమ్మా! మీరు కాదంటే నే చచ్చినంత ఒట్టు. తమరి కంతగా ఇష్టం లేకపోతే అప్పుగా తీసుకుని అవసరం తీరాక, ఒక మంచి మనిషికి ప్రాణావసరంలో సాయం చెయ్యండి. అదీ కాదంటే— ఆకలితో చచ్చే వాళ్ళ కింత గంజి దానం చేయించండి—సెలు!" ★

---

**పతనం ఎప్పుడూ ఎరుగని మానవుడు దేవునితో సమానుడు అవుతాడు. ఎప్పుడూ దేనినీ ఆశించని వాడు పశుతుల్యుడు అవుతాడు.**

—డబ్ల్యు. ఎల్. మెకజీ కింగ్

---